సాక్షి
కాకినాడ
సోమవారం । 2 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు వీరవాసరానికి చెందిన ఆకుల వీర్లస్వామి, విజయలక్ష్మి దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.





వాడపల్లి వెంకన్నకు బంగారు నామం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రాజమహేంద్రవరానికి చెందిన తెలిదేవర శ్రీనివాస్, శ్రీదేవి, సాయి శివకౌశిక్, నాగశ్రీవత్స 115 గ్రాముల బంగారు నామం సమర్పించారు.

శ్రీవారికి వెండి దశావతార వడ్డాణం



దేవరపల్లి: నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా దేవరపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి దాతలు ఆత్మకూరి వెంకట శివ నాగకుమార్, స్వాతి నాగమణి దంపతులు ఆదివారం సుమారు రూ.లక్ష విలువైన 1,400 గ్రాముల వెండి దశావతార వడ్డాణాన్ని సమర్పించారు.

పింఛన్ల పండగ



- మరో రూ.250 పెంపు
- లబ్ధిదారులకు రూ.2,750 చొప్పున పంపిణీ చేసిన వలంటీర్లు
- మురిసిపోయిన అవ్వాతాతలు సర్వత్రా హర్షాతిరేకాలు

కాకినాడ సిటీ: పింఛన్ల పంపిణీలో అవ్వాతాతల అభిమానాన్ని చూరగొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో హామీ అమలు చేసి, వారికి మరింత భరోసా కల్పించారు. పింఛన్ మొత్తాన్ని దశల వారీగా రూ.250 చొప్పున పెంచుతూ రూ.3 వేలు చేస్తామని నాడు ఇచ్చిన హామీని వరుసగా మూడో ఏడాది కూడా అమలు చేసి చూపించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పేరుతో ఇస్తున్న పింఛన్‌ను ఈ నెల నుంచి రూ.250 మేర పెంచారు. గత నెల వరకూ రూ.2,500 ఇస్తూండగా.. దీనికి రూ.250 కలిపి ఈ నెల నుంచి రూ.2,750 అందించడానికి శ్రీకారం చుట్టారు. పెంచిన పింఛన్ల పంపిణీని జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు ఆదివారం వేకువనే ప్రారంభించారు. దీనిపై సంక్రాంతి పండగ ముందే వచ్చిందంటూ సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కొత్తగా మరో 9,898 మందికి..

అలాగే కొత్తగా సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు జిల్లా వ్యాప్తంగా మరో 9,898 మందికి పింఛన్లు మంజూరు చేశారు. వీటితో కలిపి జిల్లాలో మొత్తం పెన్షన్ల లబ్ధిదారుల సంఖ్య 2,77,997కి పెరిగింది. కొత్తగా మంజూరైన వారికి మంగళవారం నుంచి రూ.2,750 చొప్పున పెన్షన్ ఇవ్వనున్నారు. గత నెల వరకూ జిల్లాలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.68.16 కోట్లు ఇస్తూండగా.. కొత్త లబ్ధిదారుల కోసం ఈ నెల నుంచి అదనంగా రూ.8.29 కోట్లు కలిపి జిల్లాకు మొత్తం రూ.76.45 కోట్లు మంజూరు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడు కేటగిరీలకు చెందిన వారికి రూ.2,750, దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, హెల్త్ పెన్షన్లు రూ.5 వేల చొప్పున పంపిణీ చేస్తోంది. దివ్యాంగులకు గతంలో ఒక రేషన్ కార్డుపై ఒక పింఛన్ మాత్రమే ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక కుటుంబంలో ఎంత మంది ఉన్నా వారందరికీ ఒకే రేషన్ కార్డుపై పింఛన్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.



కాకినాడ సాంబమూర్తినగర్‌లో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న దృశ్యం



ఇంద్రపాలెంలో వల్లి అమ్మాజీ, నున్న కనకదుర్గలకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ పలివెల సత్యరవితేజ

నిజంగా మా పెద్ద కొడుకే..



ఆరోగ్యం సహకరిస్తే చిన్నచిన్న పనులు చేసుకుంటూ పింఛనుతోనే జీవనం సాగిస్తున్నా. గతంలో పింఛను ఎప్పుడిస్తారో తెలియక పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పింఛను పెరుగుతూ వస్తోంది. ఈ నెల రూ.2,750 నగదు అందుకున్నాను. నాలాంటి వాళ్లకు ఆయన నిజంగా పెద్ద కొడుకే. పొద్దున్నే నిద్ర లేవక ముందే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ చేతికి అందిస్తున్నారు.

– గండి వెంకటలక్ష్మి, కరప

ఇంటి వద్దకే పింఛను



మూడేళ్లుగా ఇంటి వద్దకే పింఛన్లు తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా అందజేస్తున్నారు. అది కూడా తెల్లవారుజామునే ఇస్తున్నారు. ముఖ్యమంత్రి మాట ఇచ్చినట్లే పింఛన్ పెంచుకుంటూ పోవటం చాలా సంతోషంగా ఉంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చేది. ఒక్కో నెల పింఛన్ తీసుకోలేని పరిస్థితి కూడా ఉండేది.

– దండుప్రోలు వెంకటరావు, ఉప్పలంక, కరప మండలం

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ విడుదల



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెంచిన పెన్షన్ పెంపు వారోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరం రానున్న విషయం తెలిసిందే. ఆయన పర్యటన షెడ్యూల్‌ను జిల్లా అధికారులు ఆదివారం విడుదల చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయలుదేరుతారు. ఉదయం 10.10 గంటలకు హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, రాజమహేంద్రవరం నాగుల చెరువులోని మున్సిపల్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులను కలుస్తారు. అక్కడి నుంచి 11.10కి బయలుదేరి 11.20 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా వేదికకు చేరుకుంటారు. 11.20 నుంచి మధ్యాహ్నం 1.10 వరకూ స్టాల్స్ సందర్శన, వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

అనంతరం రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి బయలుదేరి నాగుల చెరువులోని మున్సిపల్ స్టేడియం వద్ద హెలిప్యాడ్‌కు1.20 గంటలకు చేరుకుంటారు. 1.35 వరకూ స్థానిక నాయకులతో మాట్లాడ తారు. అక్కడి నుంచి 1.40 గంటలకు బయలుదేరి 2.30 గంటలకు తాడేపల్లి చేరుకుంటారు.

న్యూస్‌రీల్

అందరూ సంతోషంగా ఉండాలి

జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



స్వామి వారిని దర్శించుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, అందరికీ మంచి జరగాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షించారు. స్థానిక పంచారామ క్షేత్రం శ్రీ కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని ఆమె ఆదివారం సందర్శించారు. కలెక్టర్‌కు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యాన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ధ్వజస్తంభం వద్ద పెద్ద నంది, మూలవిరాట్, ఉపాలయాలను కలెక్టర్ కృతికా శుక్లా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ ఆమెకు వివరించారు. పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కలెక్టర్‌కు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు నూతన వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ట్రస్టుబోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ కృతికా శుక్లా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం



స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ నాగలక్ష్మి

కాకినాడ లీగల్: ఆస్తుల రిజిస్ట్రేషన్లు మరింత సులభతరం కానున్నాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఎ.నాగలక్ష్మి తెలిపారు. ఆమె ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ, కాకినాడలో ప్రీమియం రిజిస్ట్రేషన్ సర్వీస్ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రీమియం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి భవనాలు అద్దెకు ఇచ్చేందుకు కొన్ని దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు సంబంధించి సచివాలయ ఉద్యోగులకు శిక్షణతో పాటు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమాచారం ఇస్తున్నామన్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ల కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. ఆన్‌లైన్‌లోనే నేరుగా తమ డాక్యుమెంట్‌ను తామే తయారు చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుందన్నారు.

నేటి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుందన్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బెంగళూరు పుష్పాలతో అందంగా అలంకరించారు. ఉత్తర ద్వారం వద్ద సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమవుతాయని ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గోదాదేవికి లక్ష చామంతి పూజ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి గ్రామోత్సవంలో కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయం వద్ద విష్ణు సహస్రనామ పారాయణ, భజన ఏర్పాటు చేశామని తెలిపారు.

డెల్టాలకు 10,200 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 1,950, పశ్చిమ డెల్టాకు 5,250 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

అందరికీ మంచి జరగాలి..



ఎంపీ గీతకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు

కాకినాడ: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఎంపీ వంగా గీత ఆకాంక్షించారు. ఆమె నివాసం వద్ద ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ సిటీ, రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ రూరల్ పరిశీలకుడు దున్నా జనార్దనరావు, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు నల్లమిల్లి సతీష్‌రెడ్డి, దీపక్‌రెడ్డి తదితరులు ఎంపీని కలసి అభినందనలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కూడా గీతను కలిశారు. స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద సుమారు 5 వేల మందికి ఎంపీ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా మరింత ప్రగతి సాధించాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: నూతన సంవత్సరారంభం, ఆదివారం కావడంతో అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యాన స్వామివారికి విశేష పూజలు చేశారు. లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.65 వేలు, అన్న ప్రసాదాల విరాళాలుగా రూ.1,10,000, వివిధ సేవల ద్వారా రూ.35,600, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.74 వేలు, వివిధ విరాళాలుగా రూ.36 వేలు కలిపి మొత్తం రూ.3,20,600 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపార.

రత్నగిరి కిటకిట

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- వ్రతాలు 2,200..
  ఆదాయం రూ.40 లక్షలు



సత్యదేవుడు, అమ్మవార్లకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: నూతన ఆంగ్ల సంవత్సర ప్రారంభ దినం, పుష్య శుద్ధ దశమి, ఆదివారం కలిసి రావడంతో వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. దర్శనం క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. వ్రతాలు 2,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. అన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. భక్తుల ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణమూర్తి పర్యవేక్షించారు.

ఘనంగా సత్యదేవుని నిత్య కల్యాణం

సత్యదేవుని నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ వేదిక మీద వేంచేయించి, పూజలు చేశారు. అనంతరం ఉప ప్రధానార్చకుడు చిట్టెం గోపి, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితుడు ముత్య సత్యనారాయణ, పురోహితుడు పాలంకి పట్టాభి.. స్వామివారి కల్యాణ క్రతువును ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

సత్యదేవుని సన్నిధిలో చాగంటి దంపతులు



చాగంటి దంపతులకు వేదాశీస్సులు అందిస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి అందించారు. సత్యదేవునితో పాటు క్షేత్రపాలకులు సీతారాములు, రత్నగిరి వనదేవతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు, అన్నవరం గ్రామ దేవత నేరేళ్లమ్మ వారిని కూడా చాగంటి దంపతులు దర్శించి, పూజలు చేశారు. ఏటా జనవరి 1న సత్యదేవుని దర్శించుకుంటున్నట్టు చాగంటి కోటేశ్వరరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం సమర్పణ



తునిలో వేంకటేశ్వరస్వామికి సమర్పించిన వెండి కిరీటం

తుని: స్థానిక పాత బజారు వీధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారికి పట్టణానికి చెందిన హైమావతి, సత్యనారాయణ దంపతులు 1.5 కిలోల వెండి కిరీటం సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ పి.విశ్వనాథరాజు ఆదివారం తెలిపారు. దాతల కోరిక మేరకు స్వామివారికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఈ కిరీటాన్ని అలంకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అన్నవరం శ్రీను, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జెడ్పీ చైర్మన్ శుభాకాంక్షలు



కలెక్టర్ కృతికా శుక్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: కలెక్టర్ కృతికా శుక్లా క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కూడా పాల్గొన్నారు. కలెక్టర్‌కు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలకృష్ణ, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, వివిధ శాఖల అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కృతికా శుక్లా కేక్ కట్ చేసి పంచారు. కాకినాడ ఆనంద నిలయం చిన్నారులు కలెక్టరేట్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీఓలు పి.నారాయణమూర్తి, కేఎస్‌వీ ప్రసాద్ కూడా హ్యాపీ న్యూ ఇయర్ చెప్పారు.

ఖతార్ ఫుట్‌బాల్ కరెన్సీ సేకరణ



ఖతార్ దేశం ముద్రించిన ఫిఫా ఫుట్‌బాల్ పోటీల స్మారక కరెన్సీ నోటు

అమలాపురం టౌన్: ఇటీవల ఖతార్‌లో జరిగిన ఫిఫా ఫుట్‌బాల్ సంగ్రామాన్ని పురస్కరించుకుని ఆ దేశం 22 రియాల్స్ స్మారక కరెన్సీ నోటు విడుదల చేసింది. దీనిని అమలాపురానికి చెందిన కరెన్సీ నోట్ల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. ఈ నోటును పాలిమర్ మెటీరియల్‌తో తయారు చేశారు. ఈ నోట్లను 6 మిలియన్లు మాత్రమే ముద్రించారు. ఈ నోటు పై ఫుట్‌బాల్ సంబరాలు జరిగిన అల్‌బేట్ స్టేడియం చిత్రాన్ని కూడా ఆ దేశం ముద్రించింది.

నో ప్రికాషన్

- మళ్లీ కరోనా అప్రమత్తత
- అయినా బూస్టర్ డోస్‌కు ముందుకు రాని జనం
- జిల్లాలో ఇప్పటి వరకూ 40 శాతమే పూర్తి
- మళ్లీ పరీక్షలు, వ్యాక్సినేషన్‌పై అధికారుల దృష్టి



జిల్లాలో ప్రికాషన్ డోస్ వివరాలు

అర్హులు (18 - 59 ఏళ్లు) :	14,56,934
టీకా వేయించుకున్న వారు : (25.8 శాతం)	3,76,091
మిగిలిన వారు :	10,80,843
60 ఏళ్లు దాటిన అర్హులు :	2,73,589
టీకా వేయించుకున్న వారు : (59.3 శాతం)	1,62,253
మిగిలిన వారు :	1,11,336

కాకినాడ సిటీ: బీఎఫ్–7 వేరియంట్ పేరుతో ప్రపంచ దేశాల్లో కరోనా డేంజర్ బెల్స్ మళ్లీ మోగుతున్న వేళ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ప్రభుత్వాల సూచనల నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రికాషన్ డోస్ వేగవంతం చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. రెండు నెలలుగా జిల్లాలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కానప్పటికీ.. అవసరం మేరకు కరోనా పరీక్షలు కూడా నిర్వహించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రికాషన్ డోస్‌పై తీవ్ర నిర్లక్ష్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తొలి కరోనా కేసు 2020 మార్చి 24న నమోదైంది. అప్పటి నుంచీ జిల్లా ప్రజలు మూడు వేవ్‌లు ఎదుర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారం మొత్తం మూడు వేవ్‌లలో 1,292 మంది మృత్యువాత పడ్డారు. వ్యాపారాలు నష్టపోయి, ఉద్యోగాలు కోల్పోయి పలువురు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో 2021 జనవరి 16వ తేదీన ప్రభుత్వం వ్యాక్సినేషన్‌ను ప్రారంభించింది. తొలి దశలో హెల్త్‌కేర్ వర్కర్లు, ఫ్రంట్‌లైన్ వారియర్లు, 60 ఏళ్లు పైబడిన వారికి కరోనా వ్యాక్సిన్ వేశారు. ఆ తర్వాత 18 ఏళ్లు నిండిన వారందరికీ వ్యాక్సినేషన్ మొదలైంది. అనంతరం 15–17 మధ్య వయస్కుల వారికి, తదనంతరం 12–14 ఏళ్ల మధ్య వారికి కూడా వ్యాక్సినేషన్ చేపట్టారు. ఇప్పటి వరకూ జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారే కాకుండా 12–14, 15–17 వయస్సు వారికి కూడా రెండు డోస్‌ల వ్యాక్సినేషన్ నూరు శాతం పూర్తయింది.

రెండు డోస్‌లు వేయించుకుని ఆరు నెలల కాలం పూర్తవడంతో పాటు 18 ఏళ్లు నిండిన వారికి ప్రికాషన్ (బూస్టర్) డోస్ వ్యాక్సిన్ వేయటం ప్రారంభించారు. ప్రికాషన్ వేయించుకోవలసిన 18–59 ఏళ్ల వయస్సు వారు 14,56,934 మంది ఉండగా 3,76,091 మంది అంటే 25.8 శాతం మంది మాత్రమే తీసుకున్నారు. 60 ఏళ్లు పైబడిన వారిలో ప్రికాషన్ డోస్‌కు అర్హులు 2,73,589 మంది ఉండగా, 1,62,253 మంది అంటే 59.3 శాతం మాత్రమే వేయించుకున్నారని అధికారులు చెబుతున్నారు.

2022 మార్చి నుంచి కరోనా మూడో వేవ్ తగ్గుముఖం పట్టడం, కేసులు అంతకంతకూ తగ్గిపోవడంతో ప్రజలు ప్రికాషన్ డోస్‌పై నిర్లక్ష్యం వహించారు. 2022 అక్టోబర్ 23 నుంచి జిల్లాలో ఒక్కరు కూడా బూస్టర్ డోస్ వేయించుకోలేదు. ఫలితంగా బూస్టర్ డోస్ ప్రక్రియ ప్రారంభించి ఏడాది కావచ్చినా జిల్లాలో 40 శాతం మాత్రమే పూర్తయింది. ప్రస్తుతం కరోనా బీఎఫ్–7 వేరియంట్ వ్యాప్తి హెచ్చరికల నేపథ్యంలో 60 ఏళ్లు పైబడిన వారికి ప్రికాషన్ డోస్ వేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం నుంచి వ్యాక్సిన్లు వచ్చిన వెంటనే నిబంధనల మేరకు వ్యాక్సినేషన్ చేస్తారని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



కరోనా కొత్త వేరియంట్‌తో పెద్దగా ముప్పు ఉండకపోవచ్చు. అనవసర అపోహలు వద్దు. ఒకవేళ కేసులు పెరిగినా కట్టడికి సిద్ధంగా ఉన్నాం. అయితే మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, తరచుగా చేతులను శుభ్రపరచుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అనుమానం ఉన్నవారు పీహెచ్‌సీలలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యాక్సిన్ ప్రికాషన్ డోస్ వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం
- అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ నిర్వహణ


సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ పెన్షన్ పథకం కింద పెంచిన పెన్షన్ పంపిణీ వారోత్సవాల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగే సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం తలమునకలవుతోంది. సీఎం పర్యటన సందర్భంగా నగరంలోని మున్సిపల్ స్టేడియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ ముందస్తు భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జిల్లా ఎస్పీ సీహెచ్ సు. దీర్‌కుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. సీఎం సభాస్థలికి వెళ్లే రూటును కారులో స్వయంగా పరిశీలించి, తగు సూచనలు చేశారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజనింగ్ (ఏఎస్ఎల్) తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలోని సభా వేదిక వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో వేదిక, సభాస్థలి ఏర్పాట్లు, సభకు ఎంత మంది వస్తారు, వాహనాల పార్కింగ్, సీఎం పర్యటన రూట్ మ్యాప్ తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మున్సిపల్ స్టేడియం నుంచి శ్యామలా టాకీస్ సెంటర్, సాయికృష్ణ థియేటర్, బీఈడీ కళాశాల, ఉల్లితోట, జాంపేట చేపల బజార్, ఆజాద్‌చౌక్, జాంపేట సెంటర్, గంధం గనిరాజు సెంటర్, వై.జంక్షన్, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం మీదుగా సీఎం ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకుంటారని చెప్పారు. సీఎం పర్యటించే మార్గంలో విద్యుత్, కేబుల్, టెలి కమ్యూనికేషన్ తీగలు అడ్డు రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులకు కేటాయించిన విధులకు సంబంధించి అంశాల వారీగా సమీక్షించారు. గ్యాలరీ ఇన్‌చార్జిలు, ప్రొటోకాల్, గ్రీన్ రూం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్, ఫొటోషూట్ గ్యాలరీ, చెక్కు పంపిణీ, లబ్ధిదారులతో ముఖాముఖికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకుని, ప్రణాళిక ప్రకారం ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఎం.రజని, ఆర్డీఓ చైత్రవర్షిణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఈ నెల 3న రాజమహేంద్రవరంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. తాడితోట, శ్యామల సెంటర్, కోటిపల్లి బస్‌స్టాండ్, వై.జంక్షన్, హైటెక్ బస్‌స్టాండ్ మీదుగా వెళ్లవలసిన ఆర్టీసీ బస్సులు మోరంపూడి సెంటర్, నేషనల్ హైవే మీదుగా వెళతాయి. రావులపాలెం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఐఎల్‌టీడీ జంక్షన్ మీదుగా బాలాజీపేట, బొమ్మూరు సెంటర్, మోరంపూడి మీదుగా వెళ్తాయి. కొవ్వూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు కోటిపల్లి బస్‌స్టాండ్, ఐఎల్‌టీడీ జంక్షన్, బాలాజీపేట, బొమ్మూరు సెంటర్, మోరంపూడి మీదుగా బస్‌స్టాండ్‌కు వెళ్తాయి. రాజానగరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు డీటీసీ సెంటర్, జేఎన్ రోడ్డు, రామాలయం సెంటర్ నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు వెళ్తాయి. సీతానగరం, గోకవరం వైపు నుంచి వచ్చే బస్సులు మెయిన్ బస్‌స్టాండ్‌కు రాకుండా వెనక్కు మళ్లిస్తారు. మున్సిపల్ స్టేడియం, ఆర్ట్స్ కాలేజీ చుట్టుపక్కల రోడ్లు చాలా రద్దీగా మారనున్న నేపథ్యంలో ఆర్‌సీఆర్‌బీ బ్రిడ్జి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను, రైల్వే స్టేషన్, ఐఎల్‌టీడీ వైపునకు, మోరంపూడి వైపు నుంచి తాడితోట వచ్చే ట్రాఫిక్‌ను వెంకటేశ్వర మార్కెట్ సెంటర్, రామాలయం వైపునకు, లాలాచెరువు వైపు నుంచి సెంట్రల్ జైలు వైపునకు వచ్చే ట్రాఫిక్‌ను వైఎస్సార్ సెంటర్ నుంచి క్వారీ మార్కెట్ వైపునకు, గోకవరం వైపు నుంచి కంబాలచెరువు వైపు వచ్చే ట్రాఫిక్‌ను క్వారీ మార్కెట్ నుంచి వైఎస్సార్ సెంటర్ వైపునకు మళ్లిస్తారు.

పార్కింగ్‌కు ఏర్పాట్లు

- కొవ్వూరు నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు కోటిపల్లి బస్టాండ్, గోదావరి బండ్, పుష్కర్ ఘాట్, దేవీచౌక్, చిరంజీవి బస్‌స్టాండ్, కోనసీమ కోవా నుంచి రైట్ టర్న్ తీసుకుని ఆర్ట్స్ కాలేజీ వెనుక హెలిపాడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- గోపాలపురం, నిడదవోలు నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు కోటిపల్లి బస్‌స్టాండ్, గోదావరి బండ్, పుష్కర్ ఘాట్, దేవీచౌక్ , చిరంజీవి బస్‌స్టాండ్ మీదుగా వచిచ కంబాలచెరువు పార్క్ వద్దనున్న షాడే స్కూల్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- కోరుకొండ నుంచి వచ్చే బస్సులు కొంతమూరు, క్వారీ మార్కెట్, మ్యాంగో మార్కెట్, మధురం స్వీట్స్ పక్క రోడునుంచి ఆర్ట్స్ కాలేజీ వెనుకనున్న హెలిపాడ్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- రాజానగరం నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు లాలాచెరువు, వైఎస్సార్ సెంటర్, క్వారీ మ్యాంగో మార్కెట్, మధురం స్వీట్స్ పక్క రోడ్డు నుంచి వెళ్లి ఆర్ట్స్ కాలేజీ వెనుకనున్న హెలిపాడ్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- రాజమహేంద్రవరం రూరల్ నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు లాలాచెరువు, సీటీఆర్ఐ, ఆర్ట్స్ కళాశాల, రైతుబజారు వద్ద ఎడమవైపు రోడ్డులోంచి టీడీడీ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు, డీటీసీ సెంటర్ మీదుగా హ్యుండయ్ కార్ షోరూమ్ పక్క స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- కడియం నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు లాలాచెరువు, సీటీఆర్ఐ, ఆర్ట్స్ కాలేజీ, వై.జంక్షన్ వద్ద టర్న్ తీసుకుని సీటీఆర్ఐ, పనసచెట్టు సెంటర్, ఎస్‌బీ మోటార్స్ వెనుక ఉన్న గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- అనపర్తి నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు లాలాచెరువు, సీటీఆర్ఐ, ఆర్ట్స్ కాలేజీ, వై.జంక్షన్ వద్ద టర్న్ తీసుకుని సీటీఆర్ఐ మీదుగా వెళ్లి ఎఫ్‌సీఐ గోడౌన్‌లో పార్క్ చేసుకోవాలి.
- రాజమహేంద్రవరం టౌన్ నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు ఎస్‌కేవీటీ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.

ముఖ్యమంత్రి రాజమహేంద్రవరంలో పర్యటించే మార్గాల్లో దుకాణాలను వ్యాపారస్తులు తెరచుకోవచ్చని పోలీసు అధికారులు తెలిపారు. అయితే పేలుడు పదార్థాలు ఉండే షాపులు మాత్రం తెరువకూడదు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తొండంగి: మండలంలో పెరుమాళ్లపురం బీచ్ రోడ్డులో తలపంటి పేట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందినట్టు తొండంగి ఎస్ఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. తలపంటిపేటకి చెందిన డి.శ్రీను బాబు (23) బైక్ పై పెరుమల్లపురం నుంచి తలపంటి పేట వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీనితో తీవ్రంగా గాయపడిన శ్రీనును కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సముద్రంలో విద్యార్థి గల్లంతు


గల్లంతయిన మణికంఠ (ఫైల్)

మలికిపురం: మండలంలోని కేశనపల్లి బీచ్ వద్ద సముద్రంలో విద్యార్థి గల్లంతయ్యాడు. రాజోలు మండలంలోని పొదలాడ గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు కేశనపల్లి బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానానికి వెళ్లిన వారిలో డిగ్రీ చదువుతున్న శివకోటి సాయి మణికంఠ గల్లంతయ్యాడు. ఈ మేరకు యువకుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరికోటి శాస్త్రి ఆదివారం తెలిపారు.

రూ.లక్ష చోరీపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం గ్రామానికి చెందిన కోలా నరేష్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదును అపహరించినట్లు సమిశ్రగూడెం ఎస్ఐ షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. జీడిపప్పు వ్యాపారం చేస్తున్న నరేష్ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి చర్చికి వెళ్లగా బీరువాలో నగదు దొంగిలించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

8 మంది అరెస్టు, రూ.95,680 స్వాధీనం

కడియం: బుర్రిలంకలోని జనసేన నాయకుడు గట్టి సుబ్బారావుకు చెందిన షెడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ. 95,680, పేకను స్వాధీనం చేసుకున్నట్లు కడియం పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తల్లికి కుమార్తె అంత్యక్రియలు


తల్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సాయిసుదర్శిని

అంబాజీపేట: నవమాసాలు కని, పెంచి, తనకో జీవితాన్నిచ్చిన కన్నతల్లికి ఆఖరి మజిలీలో అన్నీ తానే అయి, అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది ఆమె కుమార్తె. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి శివారు కుడుపూడివారిపాలేనికి చెందిన వాసంశెట్టి సీతారత్నం (75) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ఏకైక కుమార్తె పితాని సాయిసుదర్శిని మాత్రమే ఉన్నారు. సాయి సుదర్శిని భర్త సౌదీలో ఉన్నారు. శాస్త్రం ప్రకారం వీరి పిల్లలు అమ్మమ్మ అంత్యక్రియలు చేయకూడదు. ఈ నేపథ్యంలో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుంటూ తల్లి అంత్యక్రియలను సాయిసుదర్శనే నిర్వహించారు. వృద్ధాప్య పింఛను తీసుకున్న అనంతరం సీతారత్నం ఆకస్మికంగా మృతి చెందారని బంధువులు, కాలనీ వాసులు తెలిపారు. తల్లికి కర్మకాండలు నిర్వహిస్తున్న సాయిసుదర్శిని వెంట శ్మశానవాటికకు మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి ఆమెకు మనోధైర్యం కల్పించారు.

కాలువలో పడి యువకుడి మృతి

అయినవిల్లి: మండలంలోని వెలవలపల్లి గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తూ కాలువలో పడి శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూల వంశీ(20) శనివారం రాత్రి స్నేహితులతో కలిసి జనవరి ఫస్ట్ వేడుకల్లో పాల్గొనేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. మడుపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కాలువలో పడిపోయాడు. రాత్రి స్థానిక కాలువలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. దీనిపై మృతుడు తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రత్నగిరిపై ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

- ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం
- విచ్చేయనున్న విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానంద సరస్వతి


ఆలయంలో ఆకట్టుకొంటున్న పుష్పాలంకరణ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిన సోమవారం తెల్లవారుజాము నుంచి జరుగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సత్యదేవుని ప్రధానాలయంలో దక్షిణ ద్వారం వద్ద ఉత్తర అభిముఖంగా మంటపాన్ని ఏర్పాటు చేసి అందులో శేషపాన్పుపై పవళిస్తున్న విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లకు పంచ హారతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు. అనంతరం ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించేందుకు భక్తులను అనుమతిస్తారని అధికారులు తెలిపారు.

సాయంత్రం ఐదు గంటల వరకు ఉత్తరద్వార దర్శనం

స్వామి, అమ్మవార్ల ఉత్తరద్వార దర్శనానికి తెల్లవారుజామున ఐదు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ప్రాకారంలో ఊరేగిస్తారు. రాత్రి ఏడు గంటల నుంచి వెండి గరుడ వాహనంపై గ్రామంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తారని తెలిపారు.

రానున్న స్వాత్మానంద స్వామీజీ

విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ఉదయం ఐదు గంటలకు స్వామి, అమ్మవార్లను దర్శించేందుకు రానున్నట్లు అధికారులు తెలిపారు. స్వామీజీకి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీలతో బాటు సామాన్య భక్తులకు కూడా ఏకకాలంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు రెండు క్యూ లను ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు కదంబం ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. సత్యదేవుని ఆలయంతో బాటు తూర్పు రాజగోపురం, ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేశారు.

త్వరలో రాష్ట్ర స్థాయి వీసీల సదస్సు


వర్సిటీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వర్సిటీ అభివృద్ధికి నిరంతరం కృషితో పాటు విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తున్న సంస్కరణలకు అనుగుణంగా పనిచేస్తానని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ గొట్టుముక్కల వెంకటరామ ప్రసాదరాజు పేర్కొన్నారు. వీసీ అతిథిగృహంలో ఆదివారం వర్సిటీ డైరీ, క్యాలండర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో 9వ స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, కాకినాడ వర్సిటీలో రాష్ట్రంలో ఉన్న అన్ని వర్సిటీల వీసీ రాష్ట్ర స్థాయి సదస్సు ఈ ఏడాది నిర్వహిస్తామన్నారు. కాకినాడ కళాశాలకు ఎన్‌బీఐ గుర్తింపు, నరసారావుపేట కళాశాలకు ఏఐసీటీఈ గుర్తింపు వచ్చిందన్నారు. న్యాక్ ఏప్లస్, ఎన్‌బీఏ గుర్తింపు వల్ల యూజీసీ నుంచి నిధులు వస్తాయని, తద్వారా అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. సంక్రాంతి తరువాత వర్సిటీలో దాదాపు రూ.18 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్ల పనులు ప్రారంభంతో పాటు పూర్వవిద్యార్థుల సహకారంతో స్టేడియంలో నిర్మిస్తున్న భవనం త్వరగా పూర్తిచేస్తామన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంకు అనుగుణంగా యూజీ, పీజీలో సిలబస్ రూపొందించామని, బీటెక్‌లో ఏఐ ఎంఎల్ కోర్సుతో పాటు ఎంఎస్సీలో డేటా సైన్స్, ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టనున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక క్యాలెండర్ రూపొందించి పనులు పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నామని, గత ఏడాది ఆ విధానం ద్వారా ప్రగతి కనిపించిందన్నారు. పీజీ హాస్టల్ భవనం ఈ ఏడాది పూర్తిచేస్తామన్నారు. అనంతరం ఆయన సతీమణి అరుణ మిహిర, రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమల, పీఆర్ఓ సాయిబాబు, సమక్షంలో వర్సిటీ డైరీ -2023, క్యాలెండర్ ఆవిష్కరించారు. వర్సిటీ అధ్యాపకులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గణేష్



నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి జి.గణేష్ 66వ జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాల్‌బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు కెప్టెన్‌గా వ్యవహరించిన గణేష్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు.

హత్యకు దారి తీసిన న్యూ ఇయర్ వేడుకలు

- కొమరిపాలెంలో దారుణం
- ఒకరిని బలిగొన్న శృతి మించిన సరదా


మృతుడు చిన్నబాబు (ఫైల్)


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య వెంకటలక్ష్మి, కూతురు వినిత

బిక్కవోలు: న్యూ ఇయర్ వేడుకలో శృతి మించిన సరదా ఒకరి ప్రాణాన్ని బలిగొన్న ఘటన మండలంలోని కొమరిపాలెంలో ఆదివారం జరిగింది. బాధితులు పోలీసుల కథనం ప్రకారం రంగంపేట మండలం బాలవరం గ్రామానికి చెందిన కొమారపు చిన్నబాబు(20) కొమరిపాలెం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మిని 2020లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొమరిపాలెంలో నివాసం ఉంటున్నాడు. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని భార్యను, కుమార్తె వినితను పక్క వీధిలో ఉంటున్న అత్తవారింటికి పంపించాడు. అర్ధరాత్రి సమయంలో పక్కింటిలోనే ఉంటున్న వెంకటలక్ష్మి బంధువు ఖండవిల్లి నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్నాడు. ఈ క్రమంలో కేక్ క్రీమును ఒకరికొకరు పూసుకునే క్రమంలో నూకరాజు కుటుంబ సభ్యులు చిన్నబాబును హేళన చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్పంగా ఘర్షణ జరిగింది. చిన్నబాబు అత్తగారి ఇంటికి వచ్చిన తరువాత.. ఇదే విషయమై నూకరాజుకు వెంకటలక్ష్మి ఫోన్ చేసి అడిగింది. నీ భర్త రేపు ఉండడంటూ నూకరాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. తెల్లవారుజాము మూడుగంటల ప్రాంతంలో నూకరాజు కూతురు శిరీష, ఆమె భర్త ధర్మ అలియాస్ సురేష్, అతని ఇద్దరు స్నేహితులు చిన్నబాబు అత్తవారింటి వద్దకు వచ్చి బయటకు రమ్మని కేకలు వేశారు. చిన్నబాబు బయటకు రావడంతో సురేష్ కత్తితో పలుచోట్ల పొడిచి చంపేశాడని అని వెంకటలక్ష్మి ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని సీఐ వి.శ్రీనివాస్, ఎస్ఐ పి.బుజ్జిబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు.

విషాద ఛాయలు

ఈ ఘటనతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నబాబు తండ్రి రామకృష్ణకు ఇద్దరు కుమారులు. ఇటీవల పెద్ద కుమారుడు ప్రమాదం మరణించడంతో ఉన్న ఒక్క కొడుకుతో జీవనం సాగిస్తున్నారు. అయితే ఆదివారం జరిగిన ఘటన వారి కుటుంబంలో విషాదం నింపింది. నాలుగు నెలల గర్భిణి అయిన వెంకటలక్ష్మి.. ఏడాది వయసున్న కుమార్తె వినితతో చిన్నబాబు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలచి వేసింది.

నూతన సంవత్సర వేడుకలలో విషాదం

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి


మృతుడు నాగార్జున

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్లలో నూతన సంవత్సర వేడుకలలో విషాదం చోటు చేసుకుంది. శనివారం రాత్రి కొందరు యువకులు తమ బైక్‌లకు సైలెన్సర్లను తొలగించి ఊరంతా కలియతిరుగుతున్నారు. అర్ధరాత్రి సమయంలో శివారు గ్రామం కమతంగుంట హైస్కూలు సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకబైక్‌పై నూనె నాగార్జున(30), పదిలం వెంకటేశ్వరావు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌పై చొటుపల్లి సాయి ఉన్నాడు. నాగార్జున అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వరావు, సాయి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఏలూరు, విజయవాడ ఆసుపత్రులకు తరలించారు. ఏఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

న్యూఇయర్ వేడుకలకని వెళ్లి మృత్యువాత


మృతుడు సురేష్ (ఫైల్)

మండపేట: పట్టణంలో యువకుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. నూతన సంవత్సర వేడుకల కోసం స్నేహితులతో కలిసి వెళ్లి విగతజీవిగా మారాడు. దీంతో అతని కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు వీధిలో నివసిస్తున్న కొనిజాల సురేష్ (28) స్థానిక నాళం వారి వీధిలోని స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం రాత్రి స్నేహితుడు వీరబాబుతో కలిసి నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో తనకు ఫోన్‌చేసి బయటకు వస్తావా అని అడుగ్గా రానని బదులిచ్చినట్టు సురేష్ సోదరుడు దొర తెలిపాడు. చర్చికి వెళ్లిన తన తల్లి రాత్రి 1 గంట సమయంలో సురేష్‌కు ఫోన్ చేయగా బయట ఉన్నానని, కొద్దిసేపట్లో వచ్చేస్తానని చెప్పాడన్నారు. రెండు గంటల సమయంలో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయి ఉందని, మూడు గంటల సమయంలో మరోమారు చేయగా ఫోన్ రింగయినప్పటికి ఎవరు లిఫ్ట్ చేయలేదన్నాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో స్థానిక బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ స్కూల్ వద్ద లే అవుట్ సమీపంలో మృతదేహం పడిఉన్నట్టు సమాచారం తెలియడంతో వెళ్లి చూడగా సురేష్ విగతజీవిగా పడి ఉన్నాడు. అతని తలపై గాయమై ఉండటంతో ఏదైనా ప్రమాదం జరిగిందా? లేక మద్యం మత్తులో గొడవపడి ఎవరైనా హత్యచేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా మద్యం సేవించిన అనంతరం సురేష్‌ను శనివారం రాత్రి 12.30 గంటల సమయంలోనే మోటారు సైకిల్‌పై స్థానిక మెయిన్‌రోడ్డులోని థియేటర్ సమీపంలో దింపి వెళ్లిపోయానని వీరబాబు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ పి.శివగణేష్, ఎస్ఐ ఎం.అశోక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. సురేష్ మృతితో అతని ఇంట తీవ్ర విషాదం అలముకుంది.

పోతులూరులో గొర్రె గేదె కలకలం

పులి సంచరించిన ప్రాంతంలోనే..


పోలవరం కాలువలో గొర్రె గేదె

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు ఊదరేవడి మెట్ట సమీపంలోని పోలవరం కాలువలో ఆదివారం గొర్రె గేదె (అడవి గేదె) కలకలం సృష్టించింది. సమీప అటవీ ప్రాంతం నుంచి గొర్రె గేదె వచ్చినట్లు స్థానికులు తెలిపారు. గొర్రె గేదె సంచారంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో పెద్దపులి సంచరించి స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అది మరువక ముందే ఈ సారి గొర్రె గేదె వచ్చింది. పులి సంచరించిన ప్రాంతంలోనే గొర్రె గేదె సంచరించడం విశేషం. శంఖవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఆనంద్ సిబ్బందితో కలిసి గొర్రె గేదె సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. గొర్రె గేదె అక్కడ నుంచి సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిన ఆనవాళ్లను అధికారులు గుర్తించారు. గొర్రె గేదె దగ్గరకు వెళ్తే దాని స్వభావాన్ని బట్టి దాడి చేసే ప్రమాదం ఉంటుందని, ఆ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పాపికొండలు నేషనల్ పార్క్, వాతంగి ఫారెస్టు ఏరియాల్లో ఈ గొర్రె గేదెలు ఉంటాయి. అక్కడ నుంచి పోలవరం కాలువ మీదుగా ఈ ప్రాంతానికి ఈ జంతువు వచ్చి ఉంటుందని అధికారులు తెలిపారు.